క్లుప్తంగా

మహా కాళేశ్వరునిగా..



పాలకొండ రూరల్: పవిత్ర కార్తీకమాసం మూడో శనివారం సందర్భంగా పాలకొండ పట్టణంలోని నక్కలపేటలో కొలువు దీరిన మరకత మృత్యంజయిశ్వరుడు ఉజ్జయనీ మహాకళేశ్వరుడిగా భక్తులకు దర్శనమిచ్చాడు. అర్చకులు శరత్‌కుమార్ నేతృత్వంలో భక్తులు స్వామివారికి విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు.

పశువుల అక్రమ రవాణా

సీతంపేట: ఒడిశాలోని నౌపడ నుంచి విజయనగరం జిల్లా మానాపురానికి పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని శనివారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీలో 18 పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా పశువులు తరలిస్తున్న మోహత్రం ఆలీ, రిజ్వన్‌ఖాన్, షక్రోజ్ ఖాన్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. పశువులను విజయనగరం గోశాలకు తరలించినట్లు చెప్పారు.

సారా తరలిస్తున్న నలుగురి అరెస్ట్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం మూలిగూడ వద్ద సారా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పి.నారాయణరావు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మూలిగూడ జంక్షన్ వద్ద కాపుకాయగా కొందుకుప్ప ప్రాంతం నుంచి కురుపాంకు చెందిన రాయిపిల్లి అప్పారావు, బొమ్మాళి శివ, రాయిపల్లి సురేష్, సుండి ఆనంద్ ద్విచక్ర వాహనాలపై సారా క్యాన్లు, ప్యాకెట్లు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. సుమారు 70 లీటర్ల సారాతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

జీసీసీ ఎన్నికలకు 9 నామినేషన్లు

సీతంపేట: గిరిజన సహకార సంఘం సభ్యుల ఎన్నికకు సంబంధించి శనివారం 9 మంది నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎన్నికల అధికారి జి.విజయ్‌కుమార్ తెలిపారు. కూరంగి రామారావు, బిడ్డిక కృష్ణారావు, పి.ఆదినారాయణ, ఎం.ఎండయ్య, ఎం.రత్నాలమ్మ, వి.సింహాద్రి, పి.శ్రీనివాసరావు, పిరబక శ్రీనివాసరావు, కె.బలరాంలు నామినేషన్‌లు వేశారు. ఎన్నిక ఈనెల 25న జరగనుంది.

సమాచారం లేకుండా జీసీసీ ఎన్నికలా?

భామిని: గిరిజన సభ్యులకు తెలియకుండా గిరిజన సహకార సంస్థ ఎన్నికలు నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల గిరిజన సంఘ నాయకులు పిరపక శ్రీనివాసరావు, పత్తిక సింహాచలం ఆరోపించారు. సీతంపేటలో జీసీసీ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలియనివ్వ లేదన్నారు. శనివారం నామినేషన్ వేసేందుకు చివరిరోజని తెలుసుకుని హుటాహుటిన వెళ్లి నామినేషన్ వేసినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హిమరక మోహనరావు సహకారంతో జీసీసీ డైరెక్టర్లుగా నామినేషన్ వేశామన్నారు.

రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవికుమార్



భామిని: అవిభక్త శ్రీకాకుళం జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శిగా భామినికి చెందిన పోతల రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల శాఖ శనివారం ప్రకటించింది. జిల్లా కోశాధికారిగా పనిచేస్తున్న పోతల రవికుమార్ సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారని. జిల్లా అధ్యక్షుడిగా నౌపాడ రామారావుతో పాటు నూతన కార్యవర్గానికి రజక సంఘ నాయకులు అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గరుగుబిల్లి: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.మాధవి మాట్లాడుతూ విజ్ఞానం పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

పంటకోత ప్రయోగాలకు ప్రాధాన్యం

పాలకొండ: పంటకోత ప్రయోగాలకు ప్రాధాన్యత కల్పించామని సీపీఓ వీర్రాజ్ తెలిపారు. పట్టణ పరిధిలోని ఎన్‌కేరాజపురం పరిధిలో శనివారం పంటకోత ప్రయోగం, పంటల దిగుబడి లెక్కింపు చేపట్టారు. గ్రామాల వారిగా పంటల దిగుబడి అంచనా వేస్తున్నట్లు చెప్పారు. మొదటి విడతగా పంటల దిగుబడి లెక్కింపు పూర్తి చేశామని, ఈ ఏడాది ఎకరాకు సుమారుగా 34 బస్తాలు(80కేజీలు) దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు ఏఎస్ఓ చిన్నారావు, వీఏఏ నీలిమ, రైతులు పాల్గొన్నారు.

గురుకులంలో 'సంకల్పం'

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల జూనియర్ బాలికల కళాశాలలో శనివారం 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వై.అమ్మన్నరావు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, మహిళల భద్రత చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో 'సంకల్పం' ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు.

యంత్రాలతో వరి కోతలు

- సమయం, ఖర్చు ఆదా
- కోత యంత్రాలకు పెరిగిన డిమాండ్
- జిల్లాలో ఈ ఏడాది 1.66 లక్షల ఎకరాల్లో వరి సేద్యం
- ధాన్యం సేకరణకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధం



యంత్ర సాయంలో వరి కోతలు చేస్తున్న రైతులు

పాలకొండ రూరల్:



కె.రత్నకుమారి, వ్యయసాయశాఖ ఏడీ, పాలకొండ

ఖరీఫ్ సేద్యం చివరి అంకానికి చేరింది. ఈ క్రమంలో వరి కోతలు ఊపందుకున్నాయి. ఈ సమయంలో కూలీల కొరత, అధిక ఖర్చులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా అన్నదాతలు నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. ప్రస్తుతం రైతులు హార్వెస్టర్లతో వరి కోతలు గంటల వ్యవధిలో పూర్తి చేస్తున్నారు. వరి గింజ కూడా కిందకు పోయకుండా ధాన్యం నేరుగా మార్కెట్‌కు తరలించే విధంగా యాంత్రికరణపై ఆధారపడుతున్నారు. అయితే వరికోత యంత్రాలు వినియోగించే సమయంలో రైతులు, యజమానులు ఏమరుపాటుగా ఉంటే నష్టపోవాల్సి వస్తుంది. వరికోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి రైతులకు పలు సూచనలు చేశారు.

అనుసరించాల్సిన జాగ్రత్తలు

- పూర్తిగా భూమి ఎండిన తర్వాత వరి కోస్తే సమయం పూర్తిగా ఆదా అవుతుంది.
- గట్టు చుట్టూ వరి చేతితో కోయడం వల్ల ఎకరానికి పది నిమిషాలకు పైగా సమయం కలిసి వస్తుంది. దీంతో యంత్రానికి చెల్లించాల్సి మొత్తం ఆదా చేయవచ్చు.
- పొలంలో రాళ్లు ఉండే చోటును ముందుగానే గుర్తిస్తే కోత సమయంలో మిషన్ బ్లేడ్‌కు నష్టం వాటిల్లకుండా ఉంటుంది.
- తప్పనిసరిగా కోత యంత్రాలకు సబంధించిన డ్రైవర్లతో పాటు అతనికి తోడుగా మరొకరిని సహాయకుడిగా పంపించాలి.
- విద్యుత్ స్తంభాలకు చాలా దూరం నుంచే యంత్రాలను వెళ్లానివ్వాలి.
- వరి పంట నేలకు ఆనుకున్న సమయంలో మిషన్‌తో కాకుండా కూలీలతో కోత కోయించాలి.
- దిగుబడి నిల్వ ఉంచుకునే రైతులు కోత పూర్తి చేసిన వెంటనే తేమ లేని ప్రదేశంలో ధాన్యం ఆరబోసి పూర్తిగా డ్రై అయిన తరువాత నిల్వ చేసు కోవాలి.
- వాతవరణంలో మార్పులు ఉన్న సమయంలో కోతలు కోయకుండా ఉండటమే మంచిది. నేల, వరి గింజల్లో తేమ లేదు అనుకున్న సమయంలో మాత్రమే మిషన్ ద్వారా కోత కోయించాలి.



పొలం వద్ద ధాన్యం రాశులుగా పోసి బస్తాలకు ఎత్తుతున్న దృశ్యం

సమాయత్తమైన యంత్రాంగం

జిల్లాలో ఈ ఏడాది 15 మండలాల పరిధిలో లక్షా 66వేల ఎకరాల్లో 57వేల పైచిలుకు రైతులు వరి సేద్యం చేపట్టారని అధికారులు పేర్కొంటున్నారు. తాజాగా చేపడుతున్న వరికోత ప్రయోగాల ప్రాప్తికి ఎకరాకు 25 నుంచి 27 బస్తాలు దిగుబడి వస్తుందని, ఈ లెక్కన జిల్లా పరిధిలో 2.20 లక్షల టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని లెక్కలు కట్టారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ఇప్పటికే యంత్రాంగం సిద్ధమయ్యింది. 183 కొనుగోలు కేంద్రాల ద్వారా (93 పీఏసీఎస్‌లు, వెలుగు 12, జీసీసీ 21, ఆర్బీకు 42, మిగిలినవి ఎఫ్‌పీవోలకు కేటాయించారు). 93 మిల్లలకు ధాన్యం అందించేలా చర్యలు చేపట్టారు. స్థానికంగా అమ్మకాలు చేసుకునేలా, మిల్లర్లు సంచులు అందించేలా వెసులుబాటు కల్పించారు. ధాన్యం తరలించేదుకు 1,881 వాహనాలు అవసరంగా గుర్తించారు. హమాలీలను సిద్ధం చేస్తున్నారు. పౌరసరఫరా సంస్థ నేతృత్వంలో కొనుగోలు సిబ్బందికి సాంకేతిక అంశాలపై శిక్షణ అందించారు. 40 కిలల ధాన్యం పట్టే సంచి రూ. 3.39, క్వింటాకు వేతనం రూ.17.17లుగా నిర్ణయించారు. పాలకొండ డివిజన్‌లో 8 కిలోమీటర్ల రవాణాకు రూ.300, పార్వతీపురం డివిజన్‌లో రూ.295 చెల్లించనున్నారు. ఈ ఖర్చును తొలుత రైతులు భరిస్తే తరువాత వారి ఆధార్ అనుసంధానమైన బ్యాంక్ ఖాతాలకు ఆ నగదు జమచేస్తారు. అంతకుముందు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వారి వివరాలు నమోదు చేసుకోవాలని, ఒకటి రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాట్లోకి వస్తాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

గరుగుబిల్లి: చిన తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పవిత్ర కార్తీకమాసం మూడవ శనివారం కావడంతో ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి ఆలయం వద్ద బారులు తీరారు. ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు స్వామివారికి సుప్రభాతసేవ, మంగళాశాసనం, శాత్తుమురై, తీర్థ ఘోష్టి, బాలభోగం, పుణ్యహవాచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పలువురు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి, పుట్టుదేవుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణతో పాటు టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణ, అభివృద్ధి కమిటీ సభ్యులు, సిబ్బంది చర్యలు చేపట్టారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న డాక్టర్ టి.జగన్మోహనరావు

కొమరాడ: విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రోగాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు చేపడుతున్న హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. అనారోగ్యం కారణంగా పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థులు ఎవరైనా ఉన్నారా అని ఆరాతీశారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షల వివరాలను సంబంధిత యాప్‌లో పొందుపరచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు



జియ్యమ్మవలస: చినమేరంగిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ తిరుపతిరావు



గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివప్రసాద్

జియ్యమ్మవలస: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసై జీవితాలు పాడుచేసుకోవద్దని చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు సూచించారు. మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై అనీష్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీకేజీ మహరాణా, అధ్యాపకులు నగేష్, గౌరీశంకర్, కల్పన, తేజ, తదితరులున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ..జీవితాన్ని బాగు చేసుకోవాలని ఎల్విన్‌పేట ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'సంకల్పం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మత్తు పదార్థాల వినియోగంతో ఆరోగ్యం పాడవుతుందని, భవిష్యత్ నాశనమవుతుందని అన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల వద్ద ఇన్‌ఫర్మేషన్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. మత్తుపదార్థాలు విక్రయించినా, సేవించిన వారి వివరాలను సీక్రెట్‌గా ఆ బాక్స్‌లో వేయాలని సూచించారు. ఇన్‌ఫర్మేషన్ ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండచీపుర్ల సాగుకు సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం తులసీదాస్

భామిని: కొండ, మెట్ట ప్రాంతాల్లో కొండచీపుర్ల సాగుకు అనువుగా ఉపాధిహామీ పథకంలో ట్రెంచీ పనులు కేటాయించి సహకరిస్తామని ఏపీఓ ఇ.తులసీదాస్ అన్నారు. మూలగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజనులకు కొండ చీపుర్లు విలువ జోడింపుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా హార్టికల్చర్ సహాయకుడు ఎర్రన్న మాట్లాడుతూ.. స్థిరమైన ఆదాయం పొందేందుకు అనువుగా పథకాలను వర్తింప చేస్తామని వివరించారు. మూడు రోజులుగా కొండచీపుర్లుకు విలువ జోడింపుపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు వెలుగు ప్రతినిధులు తెలిపారు. చీపురు మొక్కలు పెంపకం, పుల్లల సేకరణ, సైజుల వారీగా కట్టలు కట్టే పద్ధతిపై శిక్షణ ఇచ్చినట్లు వెలుగు సీఆర్‌టీ ఆరిక రామారావు వివరించారు. ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

కొమరాడ: స్థానిక జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న హిస్టరీ అధ్యాపకుడు ఎస్.భాస్కరరావు ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు పొందడంతో కళాశాల సిబ్బంది శనివారం ఆయన్ను సత్కరించారు. ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

పాఠశాల సందర్శన

సీతంపేట: ఈతమానుగూడ గిరిజన ప్రాథమిక పాఠశాలను ఐటీడీఏ ఉపవిద్యాశాఖాధికారి పి.నారాయుడు శనివారం సందర్శించారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే వలగజ్జి గ్రామంలో ఉన్న జీపీఎస్ పాఠశాలను జీసీడీఓ రాములమ్మ సందర్శించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కొమరాడ: మండలంలోని పూడేస్ గ్రామంలో సమగ్ర రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ సంస్థ డీఎం మీనక వసంత్‌కుమార్ మాట్లాడుతూ మార్కెట్ ధర కంటె తక్కువ ధరకే నిత్యావసర సరుకులను మైక్రో లెండింగ్ పద్ధతిలో పంపిణీ చేసినట్లు చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తామని పేర్కొన్నారు. ఇప్కో అందిస్తున్న పోత్సాహకాలను ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ సిబ్బంది అల్లు పోలినాయుడు, హిమరిక పకీరు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: నగర పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకులు శనివారం కమిషనర్ సర్వేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణంలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని, పలు ప్రాంతాల్లో చెత్త కుండీలను ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయిలో పారిశుధ్య సిబ్బందిని నియమించాలని, జగనన్న కాలనీలోని గృహ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని, కొత్తగా ఏర్పడిన కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాద రాము, దూసి దర్గారావు, ఎస్.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: స్థానిక గాయిత్రీ జూనియర్ కళాశాలలో ఎస్సై జి.కళాధర్ ఆధ్వర్యంలో 'సంకల్పం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలు, మహిళల భద్రత, అత్యవసర సమయంలో ఆత్మరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మత్తు పదార్థాల వినియోగంతో ఆరోగ్యం పాడువుతుందని, జీవితం నాశనమవుతుందన్నారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమని, ఇక్కడే ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100, 112, 1930 నంబర్లకు కాల్ చేయాలన్నారు.

అందరి సహకారంతో స్వచ్ఛతా కార్యక్రమం

సీతంపేట: అందరి సహకారంతో స్వచ్ఛత సుందర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. స్థానిక ఐటీడీఏలో శనివారం నియోజకవర్గంలోని పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులకు స్వచ్ఛత సుందర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పారిశుద్ధ్యం మెరుగుకు ఎలా చర్యలు చేపట్టాలో స్వచ్ఛాంధ్ర మిషన్ సలహాదారు శ్రీనివాసన్ వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా ఎంపిక పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఏటీడబ్ల్యూఓ బి.సురేష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: బిర్సాముండా 150వ జయంతి (జన జాతీయ గౌరవ దివాస్)ని పురస్కరించుకుని టిక్కబాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల క్రీడా మైదానంలో క్రీడా ఎంపిక పోటీలను శనివారం నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం సహాయ గిరిజన సంక్షేమాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మండల పరిధిలోని 12 ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, జావ్లిన్‌త్రో, ఆర్చరీ క్రీడల్లో పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూఓ బి. సురేష్ కుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు సోమవారం పార్వతీపురంలో ఐటీడీఏ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అందులో విజేతలుగా నిలిచిన వారికి ఉన్నతాధికారుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జ్ఞానప్రసాద్, హెచ్‌డబ్ల్యూఓ అప్పారావు, తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యం



గరుగుబిల్లి: శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ, తదితరులు

గరుగుబిల్లి:

గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికల తయారీపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలపై నివేదికలు తయారు చేయాలన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంగా పనిచేస్తే పంచాయతీల అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్, ఏపీఎం పి.అప్పలనాయుడు, ఏపీఓ ఎం.గౌరీనాథ్, హౌసింగ్ ఏఈ వి.అఖిల్ తదితరులున్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

గుమ్మలక్ష్మీపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ శిక్షణలో అధికారులు అందజేసిన సూచనలు, సలహాల మేరకు గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసి పంచాయతీల ప్రగతికి బాటులు వేయాలని కోరారు. అంతకుముందు జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గుమ్మలక్ష్మీపురం: ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇస్తున్న అధికారి

ముందుస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

కొమరాడ: పంచాయతీ ప్రజల అవసరాలకు అనుగుణంగా పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ మల్లికార్జునరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామఖ్య సంఘ అధ్యక్షులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ శెట్టి శ్యామల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెట్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి మాట్లాడుతూ.. గ్రామ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



కొమరాడ: మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లికార్జునరావు

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించండి

పాలకొండ రూరల్: పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం సిబ్బందితో కలిసి పలు వ్యాపార సంస్థలు, దుకాణాలను పరిశీలించారు. ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తున్న పలువురిపై అపరాధ రుసుం విధించారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

సీతంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారులు ఆచార్య రంగనాథన్, వెంకటరమణయ్య చిత్రపటాలకు డిప్యూటీ ఈఓ పి.నారాయుడు, లైబ్రేరియన్ బొబ్బురు గణేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి సేవలను కొనియాడారు

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు కేజీబీవీని ఎంఈఓ ఆర్.ఆనందరావు శనివారం సందర్శించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థినుల అభ్యసన సమార్థ్యాలను పరీక్షించేందుకు వారికి డిక్టేషన్ టెస్ట్ నిర్వహించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితంలో వారి సామర్థ్యాలను పరీక్షించారు. 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ బాలికలకు అన్ని సబ్జెక్టులపై డిక్టేషన్ టెస్టు నిర్వహించారు.